క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆగిరిపల్లి: వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని ఈదర, శోభనాపురం గ్రామాలలో నిర్వహిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు తెలిపారు.

ఘనంగా రామాలయ పునః ప్రతిష్ఠ



కొత్త మంగాపురం(మైలవరం): మండలంలోని కొత్తమంగాపురంలో కోదండ రామాలయం పునఃప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. కోదండ రామాలయములో ధ్వజ స్తంభము, గణపతి, కుమారస్వామి, బొడ్డురాయి (నాభిశిల), ద్వార పాలకులు, ముత్యాలమ్మ, పోతరాజులు, ఆంజనేయస్వామి, మహాలక్ష్మమ్మ శిఖరములు వేద పండితుల మంత్రాలతో పునఃప్రతిష్ఠించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివార్లకు పూజలు చేశారు. అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి

గానుగపాడు(తిరువూరురూరల్): ఆంగ్లభాషలో విద్యార్థులు పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి ప్రతిరోజూ సాధన చేయాలని ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం కన్వీనర్ రాంప్రదీప్ అన్నారు. మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం టోఫెల్ బోధనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఇంగ్లిషు భాష నేర్చుకోవడానికి మంచి అవకాశం ఉందని, సెలవుల్లో సైతం ఇంగ్లిషు గ్రామర్ నేర్చుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యానికి పూర్వ వైభవం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కూచిపూడి నృత్యానికి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యుడు సప్పా శివకుమార్ అన్నారు. కొండపల్లి పట్టణంలోని సాయిబాబా ఆలయంలో కూచిపూడి నృత్యంలో ప్రావీణ్యం సంపాదించిన చిన్నారులతో కలిసి సోమవారం గజ్జెల పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్జెలకు ప్రతి ఏడాది సంప్రదాయ బద్ధంగా పూజలు చేయడం ఆనవాయితీ అన్నారు. అంతరించిపోతున్న కళలను, కళాకారులను ప్రోత్సహించాలని సూచించారు. పూజా కార్యక్రమంలో చిన్నారులు తన్మయి, వైష్ణవి, పార్థవి, సిరి, సుబ్బలక్ష్మి, జాహిత, నిషిత తితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ఇబ్రహీంపట్నం: మండలంలోని కేతనకొండ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కొమ్మూరు శ్రీనివాసరావు అనే వ్యక్తిని పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఏఎస్ఐ సువర్ణబాబుకు అందిన సమాచారం మేరకు అతని వద్ద నుంచి వివిధ రకాల 44 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.7,260 ఉంటుందని తెలిపారు. మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు సీఐ ఎం.సత్యన్నారాయణ తెలిపారు.

- ముసునూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడి చేసి, మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు. చింతలవల్లికి చెందిన వీరంకి శ్రీనివాసరావు చెక్కపల్లిలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి మద్యం బాటిల్స్ తెచ్చి, అధిక ధరలకు విక్రయిస్తుండడంతో సోమవారం దాడి చేసి ఐదు బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రిటైర్డు హెచ్ఎం మృతి



తిరువూరు: స్థానిక విజయబాల నికేతన్ ఉన్నత పాఠశాల రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు చావిడి వెంగయ్య (75) సోమవారం మృతి చెందారు. దీర్ఘకాలం పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన ఆయన సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు, పలువురు నాయకులు వెంగయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు తమ సంతాపం తెలియజేశారు.

పేద, పెత్తందారు మధ్య పోరులో వైఎస్సార్ సీపీదే విజయం

మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు



మహిళలకు అభివాదం చేస్తున్న తిరుపతిరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రానున్న సాధారణ ఎన్నికల్లో పేదలు, పెత్తందార్ల మధ్య జరిగే పోరులో పేదల పార్టీ వైఎస్సార్‌సీపీదే విజయమని మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సోమవారం సాయంత్రం విజయవాడ రూరల్ మండలం సూరాయిపాలెం, నల్లకుంట గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలను కలుసుకుని స్థానిక సమస్యలపై ఆరా తీశారు. సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాకపోతే మళ్లీ దరఖాస్తు చేయాలని సూచించారు. సర్నాల తిరుపతిరావు మాట్లాడుతూ తాను పేదవాడినని తెలిసికూడా ఒక పెత్తందారుపై పోటీకి నిలబెట్టిన ధైర్య శాలి ముఖ్యమంత్రివైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మీ కుటుంబానికి మంచి జరిగిందనుకుంటే మీరే సైనికుల్లా నిలబడి తమ పార్టీకి ఓటు వేయించాలని సీఎం జగనన్నలా ధైర్యంగా చెప్పగలిగిన నాయకుడు ఎవరైనా ఉన్నారాని ప్రశ్నించారు.

జగనన్న ప్రజాబలం తెలిసే..

వచ్చే ఎన్నికల్లో ప్రజలకు చెప్పుకునేందుకు చంద్రబాబుకు తాను చేసిన మంచి పని ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. ముచ్చటగా మూడు పార్టీలు కూటమి కట్టినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే విజయమని, జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమని అన్నారు. కార్యక్రమంలో గొల్లపూడి, సూరాయిపాలెం, నల్లకుంట గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వసంతకు ప్రజలే బుద్ధి చెబుతారు

మైలవరం: వచ్చే ఎన్నికల్లో వసంతకు ప్రజలే ఓటుతో రాజకీయ సమాధి చేస్తారని వైఎస్సార్‌సీపీ మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం సర్నాల తిరుపతిరావు మీడియాతో మాట్లాడారు. ఇటీవల టీడీపీ అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ చేస్తున్న వరుస విమర్శలకు ఆయన ఖండించారు. వైఎస్సార్ సీపీలో ఉన్నపుడు దేవినేని ఉమాని, బొమ్మసాని సుబ్బారావుని, టీడీపీని రాజకీయ సమాధి చేస్తానంటే నియోజకవర్గ ప్రజలు ఏంటో అనుకున్నారని, కానీ టీడీపీని నమ్ముకున్న దేవినేని ఉమా, బొమ్మసాని సుబ్బారావు, పార్టీనే నమ్ముకున్నవాళ్లను ఈ రకంగా సమాధి చేస్తాడని అనుకోలేదన్నారు. తాము ఇక్కడే పుట్టి పెరిగామని, ఇక్కడే రాజకీయం చేస్తామని, చచ్చేవరకు జగనన్నతోనే ఉంటామని, నీలా ఊసరవెల్లిలాగా ఉండబోమన్నారు. నన్ను జెడ్పీటీసీగా గెలిపించానంటున్నావు కానీ, జగనన్నపై ప్రజల్లో ఉన్న నమ్మకం నన్ను గెలిపించిందని, అదే నమ్మకం రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన నిన్ను కూడా ఎమ్మెల్యేగాగెలిపించిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు వెళ్లి నేను వసంత నాగేశ్వరరావు కొడుకునని చెప్పి మైలవరం సీటు సంపాదించకుని ఎమ్మెల్యేగా గెలిచి ఇప్పుడు పార్టీ ఫిరాయించడం వసంతకే చెల్లిందన్నారు. అప్పుడు కాదా జోగి రమేష్‌ను పెడన పంపి, నీకు అవకాశం ఇస్తేనే నియోజకవర్గ ప్రజలు గెలిపించారని గుర్తు చేశారు. సొమ్ములు సంపాదించగానే సరికాదని, విలువలు సంపాదించుకోవాలని సూచించారు.

ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరి

తిరువూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మాధవి

తిరువూరు: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో అనుమతి లేకుండా ఎటువంటి ప్రచారాలూ చేయవద్దని తిరువూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కే మాధవి తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీలు, కుల మతపరమైన సమావేశాలతో సహా ఎటువంటి ప్రదర్శనలు, ఇంటింటి ప్రచారాలు నిర్వహించాలన్నా ముందుగా తమ కార్యాలయంలో అనుమతి పొందాలని తెలిపారు. సమావేశాలు, ర్యాలీలను ఎంతమందితో నిర్వహిస్తున్నారో దరఖాస్తులో తెలియజేయాలని, అంతకు మించి పాల్గొంటే చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని తెలిపారు. ఈ నెల 16 నుంచి ఎన్నికల నియమావళి అమలులోకి రాగా, ఇప్పటివరకు తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో జరిపిన తనిఖీలలో సరైన ఆధారాలు లేవని గుర్తించిన నగదు రూ.5.60 లక్షలు, అక్రమంగా తరలిస్తున్న రూ.4.13 లక్షల విలువైన 829 లీటర్ల మద్యం, రూ.2.40 లక్షల విలువైన 4,475 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారిపై తిరువూరు పోలీసు స్టేషన్లో ఆదివారం కేసులు నమోదు చేశామన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు విధిగా నియమావళి పాటించాలని రిటర్నింగ్ అధికారి సూచించారు.

కమనీయం లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం

ముసునూరు: లోపూడి శివారు బాసవరప్పాడులో గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మల కల్యాణాన్ని, ముసునూరులోని వెంకటాచల స్వామివార్ల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. బాసవరప్పాడులో సోమవారం గోపయ్య స్వామి, శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె ముస్తాబులో అలంకరించి వైభవోపేతంగా కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏడువేల మందికి అన్నదానం చేశారు. ముసునూరులో అలివేలు మంగమ్మ సమేత వెంకటాచల స్వామి వార్లకు అశేష భక్తజన సాక్షిగా అర్చకుడు వేదాంతం లక్ష్మీ నరసింహాచార్యులు కల్యాణ క్రతువు నిర్వహించారు. అనంతరం స్వామివార్లు వీధుల్లో ఊరేగింపుగా తరలి వెళ్లి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీలు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



బాసవరప్పాడులో అమ్మవారి కల్యాణ మహోత్సవం

బాసవరప్పాడులో కల్యాణ మహోత్సవాలను తిలకించేందుకు కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల తోపాటు, తెలంగాణ నుంచి భారీగా భక్తులు తరలి వచ్చారు.

రజకుల అభివృద్ధికి సహకారం మరువలేనిది

రజక జన సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్టయ్య

ఆగిరిపల్లి: రజకుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక విధాలుగా తోడ్పాటు అందిస్తోందని రజక జన సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్టయ్య తెలిపారు. మండలంలోని ఈదరలో రజక వృత్తిదారుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఈదరలో రజక వృత్తిదారులు దుస్తులు శుభ్రం చేసుకోవడానికి చెరువు లేదని, తెలుగుకుంట చెరువుని రజకులకు చెందేలా సహకారం అందించాలని, దోభీ ఘాట్ పక్కన ఉన్న స్థలాన్ని బట్టలు ఆరబెట్టుకోవడానికి రజకులు ఉపయోగించుకుంటున్నారని, దానిని వారికి కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా రజక సంఘం గౌరవ అధ్యక్షుడు పగడాల సాంబశివరావు, ఈదర రజక సంఘం అధ్యక్షుడు బుద్ధవరపు నారాయణ, గోపి, శ్రీనివాస్, గరిచేపల్లి శేషగిరిరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టయ్య

ఉల్లాసంగా..ఉత్సాహంగా హోలీ

మైలవరం: మండలంలోని పలు గ్రామాల్లో హోలీ వేడుకలను ఆయా గ్రామస్తులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా తండా ఏరియా వాసులు హోలీ వేడుకలను పెద్ద పండుగగా జరుపుకుంటారు. వివిధ రంగులను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. మండలంలోని పొందుగల, అనంతవరం, కనిమెర్ల తండా, మొర్సుమల్లి తండాలలో ఈ పండుగను వేడుకగా జరుపుకున్నారు. హోలీ వేడుకలను మైలవరం శ్రీలీలావతి గిరిజన పాఠశాలలో విద్యార్థులు అత్యంత ఉత్సాహంతో జరుపుకున్నారు. సమాజంలో సామరస్యతకు, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ తెలిపారు. విద్యార్థులు నృత్యాలు చేస్తూ అలరింపచేశారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి జంజనం రాధాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: హోలీ పండుగ సంబరాలు మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ఉత్సాహంగా జరపుకున్నారు. ముఖ్యంగా సుగాలీలు అధికంగా ఉన్న కిలేశపురం, గుంటుపల్లి ఖాజీపేట, రమేష్ నగర్ ప్రాంతాలతో పాటు కొండపల్లి ఐడీఏలో వేడుకలు జరిగాయి. ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నాలుగు రోడ్లు కూడలిలో డీజే సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేసుకుని ఉల్లాసంగా నృత్యాలు చేశారు. తమ ఆచారం ప్రకారం ఇంటింటికీ తిరిగి కానుకలు సేకరించారు. సేకరించిన కానులతో సామాజిక కార్యక్రమాలు చేపడతామని పెద్దలు తెలిపారు.

ఆగిరిపల్లి: మండలంలో పలు గ్రామాల్లో ప్రజలు హోలీ పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆగిరిపల్లిలో మహిళలు, చిన్నారులు, పెద్దలు రంగులు చల్లుకుంటూ పండుగలో పాల్గొన్నారు.

చాట్రాయి మండలంలో..

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు సోమవారం హోలీ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. మండలంలోని పోతనపల్లి, గంటిపాడు తండాల్లో చిన్నా పెద్దా తేడాలేకుండా రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో లంబాడీ సంఘం నాయకులు బాలరాజు, మంగయ్య, భాస్కరరావు, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేట: మండలంలో హోలీ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. రంగులు పూసుకొని సంబరాలు జరుపుకున్నారు. ఒకరికి ఒకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు గ్రామాల్లో గిరిజనలు సంప్రదాయబద్ధంగా హోలీ పండుగ నిర్వహించారు.



కిలేశపురం సుగాలీ తండాలో హోలీ సంబరాలు



పోతనపల్లిలో రంగులు చల్లుకుంటున్న యువకులు



ఆగిరిపల్లిలో హోలీ రంగులతో చిన్నారులు

సీఎంపై అసభ్య పోస్టులు పెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం: వాట్సాప్ గ్రూపుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసభ్యకరంగా పోస్టులు పెట్టిన మల్లి (పీవీపీ)అనే వ్యక్తిపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు అందింది. వివిధ వాట్సాప్ గ్రూపుల్లో సీఎంను అగౌర పరుస్తూ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగేలా పోస్టులు పెట్టడంపై వైఎస్సార్ సీపీ మండల అధికార ప్రతినిధి కుంచం జయరాజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రిపై అసభ్యకర పోస్టులు పెట్టిన మల్లిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సీఐ సత్యనారాయణను వివరణ కోరగా.. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైభవంగా శ్రీకృష్ణుని తిరుకల్యాణ మహోత్సవం

మూడో రోజు బ్రహోత్సవాలకు పోటెత్తిన భక్తులు

నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీవేణుగోపాల స్వామి తిరుకల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతియేటా మాదిరిగానే బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఫాల్గుణశుద్ధ పౌర్ణిమ అర్ధరాత్రి స్వామి కల్యాణం జరిపారు. ఆలయం నుంచి పెండ్లికుమారుడైన శ్రీకృష్ణుని గరుడ వాహనంపైన, పెండ్లి కుమార్తెలు దేవి, సత్యాభామలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి పురవీధుల్లో భాజాభజంత్రీలు, సన్నాయి మేళాలతో ఛత్ర చమరాది ఆందోళికలతో అశేష భక్తజనం వెంటరాగా కల్యాణ వేదికకు తోడ్కొని వచ్చారు. అనంతరం అర్చకులు పరాశరం వేంకట రమణాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, అర్చక బృందంచే వేణుమాధవుని కల్యాణ మహోత్సవం వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. హేకృష్ణా, ముకుందా, మురారీ అంటూ భక్తులు కీర్తిస్తుండగా నిండు పున్నమి వెన్నెల్లో స్వామి కల్యాణం ఘనంగా జరిపారు. బ్రహ్మోత్సవాల ప్రత్యేక కార్యక్రమాలను సుప్రభాత సేవతో అర్చకబృందం ఘనంగా జరిపారు. ఆంధ్ర, తెలంగాణకు చెందిన పలు జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ ఏర్పడింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావులు తగిన ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ వెలుగుల్లో ఆలయం

వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఏర్పాట్లు చేసిన విద్యుత్ దీపాలు భక్తులను ఆకర్షిస్తున్నాయి. దేవాలయం ప్రాంగణంలో పలువురు దేవతామూర్తుల చిత్రాలను విద్యుత్‌దీపాలతో ఏర్పాటు చేశారు. ఆలయ గాలిగోపురం, శిఖరం, బేడామండలం, కల్యాణ మండపాలకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

నెమలి శ్రీవేణు గోపాస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన భక్తులకు ఆకట్టుకొంది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి 300 మంది రైతులు పలు రకాల ఉత్పత్తులను తీసుకువచ్చి ప్రదర్శనలో ఉంచారు. భక్తులు, రైతులు వీటిని ఆసక్తిగా తిలకించారు. వీటిలో మేలు రకమైన ఉత్పత్తులకు బ్రహ్మోత్సవాల ఆఖరి రోజు బహుమతులు అందజేస్తామని వ్యవసాయాధికారి బి.సాయిశ్రీ తెలిపారు. ఎంపీహెచ్ఈఓలు, వీఏఏలు, వీపీహెచ్‌లు తగిన ఏర్పాట్లు చేశారు.



గరుడ వాహనంపై కల్యాణ వేదిక వద్దకు వస్తున్న నెమలి శ్రీవేణుగోపాలస్వామి



నెమలిలో వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన తిలకిస్తున్న భక్తులు

పసుపుకుంకుమ బండ్ల రాకకు సహకరించాలి

ఏసీపీ డాక్టర్ రవికిరణ్

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్లలో ప్రధాన ఘట్టమైన అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడు నుంచి ఈనెల 28న పెనుగంచిప్రోలు వచ్చే పసుపు, కుంకుమ బండ్ల రాకకు గ్రామస్తులంతా సహకరించాలని నందిగామ ఏసీపీ డాక్టర్ రవికిరణ్ కోరారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామస్తులతో సోమవారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రవికిరణ్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అందరూ ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ఆచార, సంప్రదాయాలను గౌరవిస్తూ ఉత్సవంలో ఎక్కడా పార్టీ జెండాలు, పాటలు, రెచ్చగొట్టే మాటలు మాట్లాడకుండా సహకరించాలన్నారు. డీజేలు పూర్తిగా నిషేధమని, బండ్లకు లైటింగ్ ఏర్పాటుకు కూడా తప్పనిసరిగా పోలీసు వారి అనుమతి తీసుకోవాలన్నారు. తహసీల్దార్ వి.అమ్మాజీ మాట్లాడుతూ ఎన్నికలు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ అమ్మవారి బండి వెనుక గ్రామంలో ఒప్పందం ప్రకారం ఈఏడాది వైఎస్సార్ సీపీ బండ్లు, తరువాత టీడీపీ బండ్లు వస్తాయన్నారు. తిరునాళ్లకు పెనుగంచిప్రోలుతోపాటు అనిగండ్లపాడు గ్రామానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని, పారిశుద్ధ్య నిర్వహణకు ఆలయం వారు సహకరించాలని కోరారు. జగ్గయ్యపేట సీఐ జానకిరామ్, ఎస్ఐ పి.రాంబాబు, ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈఓ తిరుమలేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు పిడికిటి కోటేశ్వరరావు, మండల కోఆప్షన్ సభ్యులు జాన్‌మియా, గ్రామ నాయకులు వూట్ల లక్ష్మయ్య, గంగూరి ప్రసాద్, దోసపాటి దానయ్య, బొశెట్టి బ్రహ్మం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ రవికిరణ్, పక్కన తహసీల్దార్ అమ్మాజీ, సీఐ జానకిరామ్

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనారాయణ కల్యాణం

తిరువూరు: స్థానిక రాజుపేట శ్రీఅష్టలక్ష్మీ ఆలయ 15వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం విశేషపూజలు నిర్వహించారు. అష్టలక్ష్మీదేవికి, శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి పంచామృత అభిషేకాలు, అంకురార్పణ, పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం మురుకుంట్ల సీతారామలింగేశ్వర శర్మ నేతృత్వంలో శ్రీలక్ష్మీనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం జరిగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కాసులనాటి పద్మనాభశాస్త్రి, పలువురు భక్తులు కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

రంగనాయకస్వామి కల్యాణం..

తిరువూరులోని శ్రీరాజ్యలక్ష్మీ సమేత రంగనాయక స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దారా రంగారావు, పలువురు భక్తులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. సోమవారం పూర్ణాహుతితో కల్యాణోత్సవాలు ముగిశాయి.



రంగనాయకస్వామి కల్యాణం తిలకిస్తున్న భక్తులు

హ్యూమన్ సర్వీస్ సంస్థ కార్యాలయం ప్రారంభం

ఆగిరిపల్లి: అనాథలకు అండగా నిలుస్తూ హ్యూమన్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంస్థ చేస్తున్న సేవలు వెలకట్టలేనివని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సోమవారం ఆగిరిపల్లిలో సంస్థ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. సంస్థ నిర్వాహకులు నాన్సయ్యను అభినందించారు. కార్యక్రమంలో చైతన్య కిషోర్ రెడ్డి, డేన్నీ, భాస్కర్ రావు, వినోద్ రావు పలువురు సంస్థ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హ్యూమన్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అన్నసమారాధన

విస్సన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఎన్ఎస్పీ కాలువ వద్ద ఉన్న అయ్యప్ప స్వామి మండలపీఠం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. మండల పీఠం గురుస్వామి ఓలేటి దుర్గారావు, పీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పడిపూజ

తిరువూరు: స్వామి అయ్యప్ప జన్మదిన సందర్భంగా తిరువూరు పట్టణంలోని భక్త బృందం సభ్యులు సోమవారం స్వామివారి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. బస్టాండు సెంటర్లోని శ్రీరామలింగేశ్వరాలయం నుంచి స్వామి అయ్యప్ప దేవస్థానం వరకు జరిగిన ప్రదర్శనలో గురుస్వామి భవాని రాధాకృష్ణ, అయ్యప్ప ఆలయ చైర్మన్ సంకా రాజారావు, పలువురు భక్తులు పాల్గొన్నారు. అనంతరం అయ్యప్ప దేవాలయంలో పడిపూజ నిర్వహించారు.

వేంకటాచలస్వామికి గరుడ సేవ



తిరువూరు: ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా తిరువూరు శ్రీ వేంకటాచలస్వామి ఆలయంలో సోమవారం గరుడ వాహన సేవ నిర్వహించారు. స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గరుడ వాహనంపై వేంకటాచలస్వామిని ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్తారావు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా డోలోత్సవం



ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో శోభనగిరిపై వేంచేసి ఉన్న శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో లక్ష్మీపూజ, స్వామికి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో డోలోత్సవం నిర్వహించారు.